క్లుప్తంగా

పరవళ్లు తొక్కుతున్న గోదావరి



కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద పరవళ్లు తొక్కుతున్న గోదావరి

కొవ్వూరు: గోదావరి నది పరవళ్లు తొక్కుతోంది. ఎగువన విస్తారంగా వర్షాలు కురవడంతో శనివారం నదిలో ప్రవాహం భారీగా పెరిగింది. ఇసుక ర్యాంపులను ముంచెత్తింది. ఆరికిరేవుల, దండగుండ రేవుల వంటి ర్యాంపుల్లో పడవల సాయంతో సేకరించిన ఇసుక కొంతమేర కొట్టుకుపోయింది. వరద పెరగడంతో నదీ తీరం వెంబడి ఉన్న ఇసుక ర్యాంపుల్లో ఇసుక నిల్వలను ప్రభుత్వం మూడు, నాలుగు రోజులుగా రవాణాకు అనుమతించింది. ఇసుక నిల్వలు నిండుకోవడం, వరద పెరగడంతో దాదాపు అన్ని ర్యాంపులు మూతపడ్డాయి. గోష్పాద క్షేత్రం స్నానఘట్టం దిగువ వరుస మెట్లను వరద ముంచెత్తి ఉధృతంగా ప్రవహిస్తోంది. మరోవైపు భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో పంటలు ముంపు బారిన పడ్డాయి.

ఐదు పునరావాస కేంద్రాల ఏర్పాటు

నల్లజర్ల: జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు వరద బాధితుల కోసం మండలంలోని అనంతపల్లి, గుండేపల్లి (తూర్పుచోడవరం హైస్కూలు) నబీపేట, తెలికిచెర్ల, పోతవరంలలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ పి.కృష్ణారావు శనివారం తెలిపారు. ముంపు ప్రాంతాల బాధితులు ఆయా పునరావాస కేంద్రాలకు వచ్చి వసతి, భోజన సౌకర్యం పొందవచ్చన్నారు. ఈ కేంద్రాల్లోని సౌకర్యాలను మండల ప్రత్యేకాధికారి కృష్ణారావు, ఎంపీడీఓ నరేష్‌కుమార్ పరిశీలించినట్టు తహసీల్దార్ తెలిపారు.

23 నుంచి ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలు

కొవ్వూరు: ఈనెల 23 నుంచి 27 వరకూ మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్టు కమిషనర్ కె.శామ్యూల్ జోసెఫ్ శనివారం తెలిపారు. 23న శ్రీరామా కాలనీలోని సచివాలయం-1 లోను, 24న ప్రభుత్వ జూనియర్ కళాశాల లోను, 25న మద్దిపట్ల వారి వీధి సచివాలయం లోను, 26న పీఎంఎంఎం (మునిసిపల్) హైస్కూల్‌లోను, 27న ఇందిరమ్మ కాలనీ సచివాలయంలోను ఈ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాల్లో ఆధార్ నంబర్ డాక్యుమెంట్ల నవీకరణ, ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేస్తారన్నారు.

గోదావరికి మహా నీరాజనం



గోష్పాద క్షేత్రంలో గోదావరికి నీరాజనం సమర్పిస్తున్న పండితులు

కొవ్వూరు: ఆషాఢ పౌర్ణమి సందర్భంగా శనివారం సాయంత్రం గోదావరి మాతకు మహా నీరాజనం సమర్పించారు. గోదావరి నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా గోదావరి మాత విగ్రహానికి పూజలు చేశారు. వేద మంత్రోచ్చరణల మధ్య గోదావరి నదికి పండితులు వివిధ రకాల హారతులు సమర్పించారు. 226వ మాసోత్సవంలో భాగంగా నిర్వహించిన ఈ మహా నీరాజనానికి స్థానిక భక్తులు హాజరయ్యారు. గోదావరికి కొత్త నీరు రావడంతో నదిలో పసుపు,కుంకుమలు వేసి పూజలు చేశారు.

పంట నష్టం అంచనా వేయాలి

గోపాలపురం: వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించేందుకు కృషి చేస్తానని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న వరి పంటలను శనివారం ఆయన వేళ్లచింతలగూడెం, పెద్దాపురం, చిట్యాల, వెంకటాయపాలెం, చెరుకుమిల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వెంకట్రాజు మాట్లాడుతూ ఈ ఐదు గ్రామాల్లో అత్యధికంగా పంట నష్టం వాటిల్లిందన్నారు. పంట నష్టాన్ని అంచనా వేయాలని అధికారులకు ఆదేశించినట్టు చెప్పారు.

ఆర్థిక సాయం



తాళ్లపూడిలో ఆర్థిక సాయం అందజేస్తున్న ఎలక్ట్రీషియన్స్ అండ్ ప్లంబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

తాళ్లపూడి: ఇటీవల మృతి చెందిన తాళ్లపూడికి చెందిన ఎలక్ట్రీషియన్ ఎనుమల నరసింహరాజు కుటుంబానికి మండల ఎలక్ట్రీషియన్స్ అండ్ ప్లంబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సాయం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎలుబోలు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఎలుబోలు వీరరాఘవరావు, గుమ్మడి చంద్రశేఖర్, బట్టు నాగరాజు, శీలబోయిన శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, రమణ తదితరులు పాల్గొన్నారు.

వరద పరవళ్లు.. రైతు కంట కన్నీళ్లు

- ముంపులో నానుతున్న వరి చేలు
- పంటను చూసి కుమిలిపోతున్న అన్నదాత
- ముంచెత్తిన కొవ్వాడ, ఎర్ర కాలువలు
- కొవ్వూరు డివిజన్‌లో 15,600 ఎకరాల్లో వరి పంట మునక
- తగ్గుముఖం పట్టిన ఎర్రకాలువ



దేవరపల్లి మండలం గౌరీపట్నం వద్ద వరి చేలను ముంచెత్తిన కొవ్వాడ కాలువ

దేవరపల్లి: వరి చేలు రోజుల తరబడి వరద ముంపులో నానుతున్నాయి. అన్నదాతలకు దిక్కుతోచడం లేదు. నాలుగురోజులుగా విడవకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. గత 72 గంటల నుంచి వర్షం ధారలా పడుతూనే ఉంది. దీంతో కొండ ప్రాంతాల నుంచి దిగువకు వచ్చే వాగులు, వంకలు, ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఆ నీటితో చెరువులు నిండి పొంగి ప్రవహిస్తున్నాయి. వరద ముంచెత్తడంతో ఆయకట్టు భూముల్లోని వరి చేలు నాలుగు రోజులుగా నీట మునిగి ఉన్నాయి. చెరువులను తలపిస్తున్న పొలాలను చూసి అన్నదాతలు కుమిలి పోతున్నారు. మరో రెండు రోజులు నీరు ఇలాగే ఉంటే వరి దుబ్బులు కుళ్లిపోతాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. కొవ్వాడ, ఎర్ర కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జంగారెడ్డిగూడెం సమీపంలోని కొంగువారిగూడెం జలాశయానికి వచ్చే వరద ఎక్కువగా ఉంది. దాంతో అధికారులు శుక్రవారం ఉదయం జలాశయం గేట్లు ఎత్తి వేసి 1,800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఆ వరద ఎర్ర కాలువ ద్వారా నల్లజర్ల, నిడదవోలు, దేవరపల్లి మండలాను చుట్టిముట్టి, వేలాది ఎకరాల వరి చేలను ముంచెత్తింది. మరో పక్క కొవ్వాడ కాలువ కాలువ ఉగ్రరూపం దాల్చడంతో తాళ్లపూడి, గోపాలపురం, కొవ్వూరు, చాగల్లు, దేవరపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లోని పంటలు నీట మునిగాయి. కొంగువారిగూడెం జలాశయం నుంచి విడుదల చేసే జలాలను శుక్రవారం సాయంత్రం 1200 క్యూసెక్కులకు తగ్గించడంతో ఎర్ర కాలువలో ప్రవాహ ఉధృతి తగ్గుముఖం పట్టినట్టు అధికారులు చెబుతున్నారు.

15,600 ఎకరాల్లో వరిచేలు మునక

కొవ్వూరు డివిజన్‌లోని తాళ్లపూడి, కొవ్వూరు, గోపాలపురం, దేవరపల్లి, చాగల్లు, నల్లజర్ల, నిడదవోలు మండలాల్లో సుమారు 15,600 ఎకరాల్లో వరి చేలు నీటమునిగి ఉన్నట్టు ఏడీఏ పి.చంద్రశేఖర్ తెలిపారు. కొవ్వూరు డివిజన్‌లో ఎక్కువగా కొవ్వాడ, ఎర్ర కాలువల వరద నీరు పంటలను ముంచెత్తినట్టు చెప్పారు. కొవ్వాడ కాలువ వల్ల సుమారు 5,200 ఎకరాలు, ఎర్రకాలువ వల్ల 10,400 ఎకరాల్లోని వరి చేలు నీట మునిగి ఉన్నట్టు ఇప్పటి వరకూ ఉన్న ప్రాథమిక అంచనా అని వివరించారు.

రైతుల పరిస్థితి దయనీయం



రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఎర్ర కాలువ ఉధృతికి త్యాజంపూడి, కురుకూరు గ్రామాల్లోని రెండు వేల ఎకరాల్లో వరి చేలు నీట మునిగాయి. ఇప్పటికే మూడు రోజులుగా చేలు నీటిలో ఉన్నాయి. మరో రెండు రోజులు ఉంటే పంట పని చేయదు. గ్రామంలోని బర్లవాగు, మామిడికాయల రేవు పొంగి ప్రవహిస్తున్నాయి. ఎర్ర కాలువకు పలు ప్రాంతాల్లో గండ్లు పడ్డాయి. ఈ ఏడాది ఖరీఫ్ సాగు కష్టమే.

– పల్లి వెంకటరత్నారెడ్డి, రైతు, త్యాజంపూడి, దేవరపల్లి మండలం

శాశ్వత పరిష్కారం చూపాలి



కొన్ని రోజులుగా వరదనీటిలో ఉండడంతో వరి దుబ్బులు కుళ్లిపోతున్నాయి. కొవ్వాడ కాలువ వల్ల వందలాది మంది రైతులు నష్టపోతున్నారు. కాలువ పూడిక తీసి అభివృద్ధి చేయాలని దాదాపు 30 ఏళ్లుగా అధికారులను కోరుతూనే ఉన్నాం. పంటలు మునిగినప్పుడు వచ్చి చూడడం తప్ప పట్టించుకోవడం లేదు. నాలుగు మండలాల రైతులు నష్టపోతున్నాం. శాశ్వత పరిష్కారం చూపాలి

– టి. కృష్ణారావు, రైతు, వెంకటాయపాలెం, గోపాలపురం మండలం

భారీ వర్షాలకు దెబ్బతిన్న వరి చేలు



కొవ్వాడ కాలువ ఉగ్రరూపం దాల్చి, కాలువకు ఇరువైపులా గల పంటలను ముంచెత్తింది. ఇప్పటికీ వందలాది ఎకరాల్లోని వరి చేలు నీటిలోనే ఉన్నాయి. రెండెకరాల్లో వరి పంట వేశాను.ఎకరాకు రూ. 10 వేల చొప్పున పెట్టుబడి పెట్టాను. కొవ్వాడ కాలువలో పూడికతీసి అభివృద్ధి చేయకపోతే ఖరీఫ్ సాగు కష్టమే. అధికారులు, ప్రజాప్రతినిధులు కాలువ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి.

– మందం త్రిమూర్తులు, రైతు, తిరుగుడుమెట్ట, తాళ్లపూడి మండలం

మంద కాలువ ముంచేస్తోంది



నల్లజర్ల, అచ్చన్నపాలెం మీదుగా ప్రవహిస్తున్న మంద కాలువ పంటలను ముంచేసింది. ఏటా వర్షా కాలంలో పంట నష్టపోతున్నాం. వారం క్రితం ఏడెకరాల్లో వరి నాట్లు వేశాను. సుమారు రూ.70 వేల పెట్టుబడి అయ్యింది. ఊడ్చిన చేను పని చేయదు. మరలా ఊడ్చుదామన్నా నారు దొరకని పరిస్థితి. అంత పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేయలేని దుస్థితి. వాగు ముంపు బారి నుంచి ఆయకట్టు రైతులను కాపాడాలి.

– తొంటా శ్రీనివాసరావు, రైతు, తూర్పు చోదవరం, నల్లజర్ల మండలం

ముంపులో 8,420 హెక్టార్ల వరి పంట

జిల్లా ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు



తాళ్లపూడి మండలం పెద్దేవం వద్ద నీట మునిగిన వరి పైరు వద్ద రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

తాళ్లపూడి: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా వివిధ దశల్లో ఉన్న 8,420 హెక్టార్లలోని వరి చేలు ముంపునకు గురయ్యాయని జిల్లా ఏరువాక కేంద్రం కో- ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. వర్షాలకు ముంపు బారిన పడిన మండలంలోని మలకపల్లి, పెద్దేవం, తిరుగుడుడుమెట్ట గ్రామాల్లోని వరి చేలను శనివారం వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలతో కలసి ఆయన పరిశీలించారు. మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, కొవ్వూరు ఏడీఏ చంద్రశేఖర్, ఏవో జి.రుచిత తదితరులు ముంపులో ఉన్న వరి చేలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.తాళ్లపూడి మండలంలో 594 హెక్టార్లలోని వరిపైరు ముంపులో ఉన్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ వర్షాలు రెండు,మూడు రోజుల్లో తగ్గితే నీరు బయటకు వెళ్లేలా చూడాలన్నారు. ముంపు నుంచి తేరుకున్న తరువాత తగిన యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. జిల్లాలో 68 శాతం మేర వరినాట్లు పూర్తయినట్టు చెప్పారు.

కల్వర్టుల పైనుంచి కొవ్వాడ కాలువ పరవళ్లు



తాళ్లపూడి మండలం పెద్దేవం రోడ్డులో చెరువును తలపిస్తున్న వరి చేలు



తాళ్లపూడి మండలం అన్నదేవరపేటలో కొవ్వాడ వరదను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు

తాళ్లపూడి: మండలంలో కొవ్వాడ కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువన కురిసిన భారీ వర్షాలకు వచ్చి చేరుతున్న నీటితో శనివారం కూడా వరద ఉధృతి కొనసాగింది. మండలంలోని పంట పొలాలు ఇప్పటికీ ముంపులోనే ఉన్నాయి. కొవ్వాడ కాలువ వరద, వర్షాల వల్ల మండలంలో దాదాపు 750 ఎకరాల్లోని వివిధ పంటలు ముంపులో చిక్కుకున్నట్టు అధికారులు అంచనా వేశారు. కొవ్వాడ కాలువ వరదతో రాగోలపల్లి నుంచి తాడిపూడి వైపు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు కల్వర్టుపై 15 అగుడుల మేర అర కిలోమీటరు పొడవునా నీరు ప్రవహిస్తోంది. అలాగే అన్నదేవరపేట నుంచి వేగేశ్వరపురం వైపునకు వెళ్లే కల్వర్టు, తిరుగుడుమెట్ట వైపు వెళ్లే మరో కల్వర్టుపై నుంచి కూడా ఉధృతంగా వరద ప్రవహిస్తోంది. దాంతో రైతులు నిత్యం వచ్చిపోయే ఈ మార్గాలపై రాకపోకలు పూర్తిగా స్థంభించాయి.ఈ మార్గంలో వెళ్లవద్దంటూ అధికారులు హెచ్చరిక బోర్డులు కూడా పెట్టారు. కొవ్వాడ కాలువ నీరు అన్నదేవరపేటలో ఇళ్ల వద్దకు చేరింది. రాగోలపల్లి, పోచవరం, తుపాకులగూడెం, బయ్యారం, అన్నదేవరపేటలలో సుమారు 450 ఎకరాల్లోని వివిధ పంటలు ముంపు బారిన పడ్డాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి నుంచి మండలంలో ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. పౌర జీవనానికి అంతరాయం కలిగింది. తిరుగుడుమెట్ట, పెద్దేవం, వేగేశ్వరపురం, పైడిమెట్ట, తాళ్లపూడి, అన్నదేవరపేట తదితర గ్రామాల్లో వరి చేలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. తిరుగుడుమెట్ట నుంచి పెద్దేవం వెళ్లే రోడ్డుపై నుంచి నీరు ప్రవహిస్తోంది. తహసీల్దార్ పి. శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ కేఎస్ వీరన్న అన్నదేవరపేటలో కల్వర్టులను పరిశీలించారు.

ముంపు రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ

- అందించాలని మంత్రి దుర్గేష్ అధికారులకు ఆదేశం
- పెరవలి మండల పరిషత్ సమావేశం
- పాల్గొన్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

పెరవలి: ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలు అర్హులందరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పెరవలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అధ్యక్షతన శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల పంటలు కోల్పోయిన ప్రతి రైతుకూ ఇన్‌పుట్ సబ్సిడీ రూ.6 వేలు అందించాలని అధికారులను ఆదేశించారు. నిడదవోలు నియోజకవర్గంలో 16 వేల ఎకరాల్లోని పంటలు ముంపు బారిన పడ్డాయన్నారు. అధికారులు సత్వరమే స్పందించి బాధిత రైతులకు అండగా ఉండాలన్నారు. పెరవలి మండలంలో 650 ఎకరాల్లో వరి పంట, 60 ఎకరాల్లోని వాణిజ్య పంటలు ముంపుబారిన పడ్డాయని, వారందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ అందేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చామన్నారు. దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించి ఎర్ర కాలువ గట్ల పటిష్టతకు చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాల వల్ల అంటు వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు అవసరమైన గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. ఏటిగట్ల పటిష్టత విషయాన్ని ముఖ్యమంత్రితో నేరుగా సంప్రదించగా, సానుకూలంగా స్పందించారని మంత్రి దుర్గేష్ తెలిపారు. నియోజకవర్గంలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.12 కోట్లు మంజూరు చేయించానని, త్వరలోనే పనులు చేయిస్తామని తెలిపారు.

జెండా వందనం ఎంపీటీసీలతో చేయించాలి

ఆగస్టు 15న పాఠశాలల్లో తమతో జాతీయ జెండా ఎగుర వేయించాలని పలువురు ఎంపీటీసీ సభ్యులు ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్‌ను కోరారు. అలాగే తమకిచ్చే గౌరవ వేతనాన్ని రూ.3 వేల నుంచి రూ.10 వేలకు పెంచాలని కోరారు. ఈ మేరకు వారు మంత్రికి వినతి పత్రం అందించారు. తమకు రూ.16 నెలలుగా వేతనం అందడం లేదని, వెంటనే చెల్లించాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలంటూ మంత్రికి వినతి పత్రం అందించారు. తమ గ్రామంలో 450 ఎకరాల పంట పొలాలు మునిగి పోయాయని, ఆదుకోవాలని కోరుతూ కానూరు రైతులు వినతి పత్రం అందించారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ కూడా సమావేశంలో మాట్లాడారు. మండల ప్రత్యేకాధికారి సునీల్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి, తహసీల్దార్ డి. సుధ వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో ముంపు నీరు తీయించండి



నీట మునిగిన వరిపంట రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరిస్తున్న మాధవరావు

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

నల్లజర్ల: వర్షాలకు నీట మునిగిన వరి చేలు రెండు రోజుల్లో తేరుకోకుండా మరిన్ని రోజులుంటే మొక్కలు కుళ్లిపోయే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు అన్నారు. మండలంలోని తూర్పు చోడవరం గ్రామంలో మంద కాలువ వరద ముంపునకు గురైన వరి పొలాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ ముంపు నీరు బయటకు వెళ్లిన తర్వాత ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ అదనంగా చల్లుకోవాలని సూచించారు. వరద నీరు దిగువకు పోయే అవకాశం లేకపోతే ఉపాధి కూలీలతో ఆ నీరు బయటకు పోయేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇది కలెక్టరు ఆర్డర్ అన్నారు. పోతవరం, నల్లజర్ల, తూర్పుచోడవరం, తెలికిచెర్ల గ్రామాల్లో ఉపాధి కూలీల అవసరం ఉందని రైతులు ఆయనకు వివరించారు. ఏవో కె.కమల్‌రాజ్, వ్యవసాయ సహాయకులు అనూష, సాయి, హేమంత్, కె.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఎర్ర' ప్రళయం

- బిక్కుబిక్కుమంటూ కంసాలిపాలెం, తాళ్లపాలెం గ్రామస్తులు
- నలుమూలల పోటెత్తుతున్న ఎర్ర కాలువ
- సుమారు 7 వేల ఎకరాల్లో నీట మునిగిన పంటలు

నిడదవోలు రూరల్: ఎర్ర కాలువ ఉగ్రరూపం దాల్చడంతో కంసాలిపాలెం, రావిమెట్ల, శంకరాపురం, సింగవరం, తాళ్లపాలెం గ్రామాల్లోని పంటలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. సుమారు 7 వేల ఎకరాల్లో పంట నీట మునిగినట్టు అధికారుల అంచనా. కంసాలిపాలెం, సింగవరం, రావిమెట్ల, జె.కండ్రిగ గ్రామాల్లోని పలు కాలనీలు, రోడ్లు జలమయం అయ్యాయి. కంసాలిపాలెం- మాధవరం, సింగవరం-కంసాలిపాలెం, మాధవరం- కంసాలిపాలెం మధ్య రాకపోకలు స్తంభించాయి. కంసాలిపాలెం వాసులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. మరోవైపు గోదావరి కూడా ఉగ్రరూపం దాల్చడంతో పురుషోత్తపల్లి, పందలపర్రు, పెండ్యాల, విజ్జేశ్వరం, అమ్మేపల్లి, కోరుమామిడి, తాడిమళ్ల, కాటకోటేశ్వరం, ఉనకరమిల్లి, రావిమెట్ల, సింగవరం, జె.కండ్రిగ, కంసాలిపాలెం, తాళ్లపాలెం గ్రామాల పరిధిలోని వరి, చెరకు, అరటి, కూరగాయల తోటలు, ఇటుక బట్టీలు నీట మునిగాయి. భారీగా నష్టం వాటిల్లినట్టు రైతులు తెలిపారు.

ఎర్రకాలువ ముంపుతో తిమ్మరాజుపాలెం, కంసాలిపాలెం, రావిమెట్ల, సింగవరం, తాళ్లపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో 134 మందికి ఆశ్రయం కల్పించినట్టు తహసీల్దార్ నాగభూషణం శనివారం తెలిపారు. సింగవరం, రావిమెట్ల గ్రామాల్లోని పునరావాస కేంద్రాల్లో భోజన ఏర్పాట్లు, మెడికల్ క్యాంపులను కలెక్టర్ పి.ప్రశాంతి, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ్, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్. కృష్ణనాయక్, మండల ప్రత్యేకాధికారి దుర్గేష్ పరిశీలించారు.

నిడదవోలు పట్టణంలో..

నిడదవోలు: ఎర్ర కాలువ వరద పట్టణ శివారు తీరుగూడెం, సుబ్బరాజుపేట ప్రాంతాలను చుట్టిముట్టింది. సింగవరం, తీరుగూడెం, సుబ్బరాజుపేటలలో పంటలు నీట మునిగాయి. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధికారులతో కలసి శనివారం ముంపు ప్రాంతాలను పరిశీలించారు. తీరుగూడెం వెళ్లే రహదారి వద్ద ట్రాక్టర్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. బ్లీచింగ్ చల్లించాలని, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ముంపు ప్రాంతాల వాసులు కోరగా, అందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. అక్కడ నుంచి ఆయన పట్టణంలోని గాంధీనగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో ఎర్ర కాలువ వరదలో నీట మునిగిన పంటలను పరిశీలించారు.

పెరవలి మండలంలో 690 ఎకరాలు

పెరవలి: మండలంలో వరి చేలు 650 ఎకరాలు, ఉద్యాన, కూరగాయల పంటలు 40 ఎకరాల్లో నీట మునిగినట్టు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదించారు. నీరు పూర్తిగా తొలగాక పూర్తి అంచనాలు వస్తాయని అధికారులు తెలిపారు. కానూరు బాడవలో 450 ఎకరాల్లోని వరిచేలు పూర్తిగా నీటమునిగాయి. ఖండవల్లి, అన్నవరప్పాడు, ముక్కామల, ఉసులుమర్రు, కానూరు అగ్రహారం గ్రామాల్లో 240 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి.

ఉండ్రాజవరం మండలంలో 2,500 ఎకరాలు

ఉండ్రాజవరం: ఎర్ర కాలువ వరద ఉధృతికి యనమదుర్రు డ్రైన్ పొంగి ప్రవహిస్తుండడంతో మండలంలోని సూర్యారావుపాలెం, పసలపూడి, కాల్దారి గ్రామాల్లోని సుమారు 2,500 ఎకరాల్లోని వరిపైరు నీట మునిగినట్టు రైతులు తెలిపారు.

చాగల్లు మండలంలో 1676 ఎకరాలు

చాగల్లు: శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకూ 32 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నిడదవోలు–పంగిడి రోడ్డుపై ఊనగట్ల వద్ద వర్షపు నీరు ప్రవహిస్తోంది. పలు గ్రామాల్లో చెరువులు నిండిపోయి పొంగి పొర్లుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల ఆవరణలు నీట మునిగాయి. పేములకాలువ వరద పెరుగుతోంది. బ్రాహ్మణగూడెం, నందిగంపాడు, మార్కొండపాడు, ఊనగట్ల, ఎస్.ముప్పవరం తదితర పల్లపు ప్రాంతాల్లోని పంటలు నీట మునిగాయి.మండలంలో 1676 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి.1650 ఎకరాల్లో వరి చేలు, 26 ఎకరాల్లో అరటి తోటలు నీట మునిగాయని తహసీల్దార్ ఎం.సావిత్రి తెలిపారు. కలవలపల్లిలో ఒక ఇల్లు దెబ్బతింది.



సింగవరంలో నీట మునిగిన పంట పొలాలు



చాగల్లులో నీట మునిగిన పంట పొలాల్లో రైతులు



నిడదవోలు మండలం సింగవరంలో పునరావాస కేంద్రాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

వరద ముంపును పరిశీలించిన ఎమ్మెల్యే



కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో వరద నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలోకి వరద నీరు చేరింది. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. వర్షపు నీరు కోర్టు ప్రాంగణం నుంచి బయటికి వెళ్లే మార్గం లేకపోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంగణంలో జిల్లా కోర్టుతో పాటు మరో మూడు కోర్టులు పని చేస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం,అగ్నిమాపక కేంద్రం, పట్టణ పోలీసు స్టేషన్ వంటి కార్యాలయాలు ఇదే ప్రాంగణంలో ఉండడంతో నిత్యం వివిధ పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చే జనం ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి పరిస్థితిని న్యాయవాదులు ఎమ్మెల్యేకు విన్నవించారు. శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బారాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు మండలంలో..

చాగల్లు: మండలంలోని చాగల్లు, నెలటూరు గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలు, డ్రైన్లు, రోడ్లను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించారు. తక్షణ చర్యలు తీసుకుని ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. తహసీల్దార్ ఎం.సావిత్రి, ఎంపీడీవో ఎస్.బుజ్జి, టీడీపీ నాయకులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com